వెలుగుల పండుగకు వేళాయె!

- పిల్లలు, పెద్దల సందడి
- కిటకిటలాడుతున్న బాణసంచా, వస్త్ర దుకాణాలు



కరకగూడెంలో టపాకులు కొంటున్న చిన్నారులు



భద్రాచలంలో ప్రమిదల కొనుగోలు వద్ద ప్రజల సందడి

భద్రాచలంటౌన్/కరకగూడెం/దమ్మపేట: దీపాల పండుగ సందర్భంగా మార్కెట్‌లు ఉత్సాహంగా మారాయి. శనివారం రాష్ట్ర బంద్ కావడంతో ఆదివారం టపాసుల, ఇతర సామగ్రి కొనుగోలుకు భారీగా ప్రజలు తరలివచ్చారు. కొత్త బట్టలు, పటాకులు, స్వీట్లు, బహుమతుల కొనుగోళ్లతో దుకాణాలు కాంతులతో మెరిసిపోయాయి. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ షాపింగ్‌లో తలమునకలై కనిపించారు. వ్యాపారులు కూడా ప్రత్యేక ఆఫర్లు, డిస్కౌంట్‌లతో కస్టమర్లను ఆకట్టుకుంటున్నారు. కాగా, దీపావళి సామగ్రి అమ్మకాల వద్ద దుకాణాదారులు నిబంధనలు పాటించాలని భద్రాచలం అగ్నిమాపక అధికారి జి.శ్రీనివాస్ సూచించారు.

హరిత దీపావళి.. ఆనందాల కేళి

భద్రాచలంఅర్బన్: దీపావళి రోజున టపాసులకు దూరంగా ఉండి పర్యావరణహితమైన పండుగను జరుపుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. రసాయనాలతో తయారుచేసే బాణసంచాలతో ఆరోగ్యానికి హానికరం. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు టపాసులకు బదులు ఒక మొక్కను బహుమతిగా ఇచ్చి, నాటించాలని పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు.

సంక్షిప్తంగా..

‘ఆశ్రమం’లో అమలుకాని మెనూ?

ములకలపల్లి: మండలపరిధిలోని కమలాపురం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మెనూ అమలులో అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 250 మందికిపైగా విద్యార్థులున్న ఈ హాస్టల్‌లో మూడో ఆదివారం మటన్ వండాల్సి ఉండగా.. బాయిలర్ కోడి కూర పెట్టి చేతులు దులుపుకున్నట్లు తెలిసింది. హాస్టల్ రికార్డుల్లో మటన్ పెట్టినట్లు రాసుకుని, చికెన్ వడ్డించడం ద్వారా నిధులు కాజేస్తున్నారా? అనే సందేహం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. కొన్నాళ్లుగా హాస్టళ్లలో ఇదే పరిస్థితి నెలకొన్నట్లు వినికిడి.

వైద్యాధికారుల ఆదేశాలు పట్టవా?

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు, అంబేడ్కర్ సెంటర్‌కి మధ్యలో అనధికారికంగా ఓ క్లినిక్ ప్రతి ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు నడుస్తోంది. అనుమతులు లేకుండా క్లీనిక్‌ను నడుపవద్దని ఇటీవల డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్య ఆదేశించారు. లేదంటే క్లీనిక్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అయినప్పటికీ ఈ ఆదివారం మధ్యాహ్నం నుంచి సదరు క్లినిక్ తెరిచి ఉంచడం కనిపించింది.

పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

మణుగూరుటౌన్: మణుగూరు పట్టణంలో రూ.25లక్షల వ్యయంతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి కాగా.. డివైడర్ల మధ్యలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌తో కలిసి స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం ప్రారంభించారు. మరోవైపు, ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని.. స్థానిక ఎన్నికల్లో గెలుపుదిశగా కృషి చేయాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు పి.నవీన్, టౌన్ అధ్యక్షుడు శివసైదులు, మైనార్టీ అధ్యక్షుడు రహీం పాషా, యూత్ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, మండల అధ్యక్షురాలు సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సజ్జలను కలిసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

భద్రాచలంటౌన్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లు వెంకటరెడ్డి పార్టీ పొలిటికల్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జగనన్న అభిమానులకు భరోసా కల్పించేలా తెలంగాణలో పార్టీని కొనసాగించాలని కోరారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేందుకు ప్రతి అభిమాని తమవంతు కృషి చేయాలని సజ్జల సూచించిన్నట్లు ఆయన తెలిపారు.

పోలీసుల తనిఖీ

చర్ల: చర్లలో జరిగే వారపు సంతకు ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టు సానుభూతిపరులు రావచ్చునన్న అనుమానంతో సీఐ రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్‌లు తనిఖీలు నిర్వహించారు.

పినపాక: బయ్యారం క్రాస్ రోడ్, బయ్యారం గ్రామంలోని పలు దుకాణాల్లో ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేశారు. మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నారా అనే కోణంలో పరిశీలించారు.